'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఉరిమే ఉత్సాహంతో 'చలో వరంగల్'



వనపట్ల సుబ్బయ్య
94927 65358

**అవమానాల మధ్య ఆత్మగౌరవాన్ని రగిలింపచేసిన రోజు.. అరవై ఏండ్ల చీకటి పాలనకు, అహంకారానికి చరమగీతం పాడిన రోజు.. అరవై ఏండ్ల కల ఇక కలగానే మిగిలిపోనుందా? అనే నైరాశ్యంలో ఉన్నవేళ నెత్తుటి భూమ్మీద ఒక అగ్నిశిఖ రేగింది. ఆ అగ్నిశిఖే కేసీఆర్. అతనే తెలంగాణ సాధకుడు. రాష్ట్రం కోసం రాజకీయ పార్టీని స్థాపించి రాజకీయం ద్వారానే తెలంగాణ సాధ్యమని ఆచరణలో నిరూపించిన కార్యదక్షుడు. విద్యుత్తు చార్జీలను తగ్గించమని అడిగితే ఆనాటి అధికార టీడీపీ ఆయనను తెలంగాణ వాదిగా ముద్ర వేసింది. తెలంగాణ కన్నీళ్లను ప్రశ్నిస్తే తన పార్టీవారే చులకనగా చూశారు. ఆ సందర్భం కేసీఆర్ హృదయాన్ని కలచివేసింది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి పదవికి, శాసన సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) రాజీనామా చేశారు. తెలంగాణ దుఃఖం బాధల ముందు పదవులేవైనా తనకు గౌరవప్రదం కాదన్నారు. తెలంగాణ అస్తిత్వ ఉద్యమవాదిగా జెండా ఎత్తి ఉద్యమ నాయకుడిగా ముందుకు నడిచారు.**

ఎవరు కాదన్నా, ఎవరు అవమానించినా, ఎగతాళి చేసినా, కించపర్చినా తన అంతిమ లక్ష్యం రాష్ట్ర సాధనే. రాజకీయ ప్రక్రియ ద్వారానే ముందుకు నడిచి నెత్తురు బొట్టు చిందకుండా ఉద్యమ పార్టీని నడిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసంలో 2001 ఏప్రిల్ 27 న జలదృశ్యం జనసంద్రం కాగా తెలంగాణ జాతి అస్తిత్వం కోసం త్యాగాల పునాదిగా టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ కోసం కేసీఆర్ సిపాయిలా ముందుండి పోరాటం చేశారు. తెలంగాణ వాదాన్ని లక్ష్యాన్ని భావవ్యాప్తి కోసం తానే స్వయంగా కవియై ఉద్యమ గీతాన్ని రాశారు. జలదృశ్యం దగ్గర జెండా ఎగరేసి జై తెలంగాణ అని గర్జించి కదిలారు. అమరవీరుల స్థూపం దగ్గర నివాళులు అర్పించి కర్తవ్య దీక్ష పూనారు.

2001లో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభిస్తూ టీఆర్ఎస్ ఆవిర్భావ సమావేశంలో కేసీఆర్ చేసిన ప్రసంగంలోని మాటలు చరిత్రాత్మకమైనవి. అవేటంటే 'ఉద్యమ పంథా వీడను. ప్రాణం పోయినా బిగించిన పిడికిలి విడువను. ఎత్తిన జెండా దించను. కచ్చితంగా రాష్ట్రం సాధిస్తా, ఒకవేళ నేను పెడ మార్గం పడితే నన్ను రాళ్లతో కొట్టి చంపండి. నేను దృఢమైన సంకల్పంతోని, కచ్చితంగా రాష్ట్రాన్ని సాధించాలనే సదుద్దేశంతో ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నా. ఇంటికి ఒక్క యువకుడిని నాకు అప్పచెప్పండి. వంద శాతం తెలంగాణ రాష్ట్రం సాధిస్తా' నంటూ తన ప్రస్థానానికి పదును పెట్టుకున్నారు. అప్రతిహతంగా ఉద్యమాన్ని కొనసాగించారు.

టీఆర్ఎస్ బలపడుతుందేమోనని అక్కసుతో చంద్రబాబు ప్రభుత్వం జలదృశ్యంలోని కార్యాలయ విధ్వంసానికి చేసిన రచన నేటికీ మదిలో మెదులుతూనే వుంది. ఆ చంద్రబాబే తదనంతర కాలంలో మూటా ముల్లె సర్దుకొని తన ప్రాంతానికి పారిపోయారు.

> 2001 మే 17న కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభ ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో పలు మార్పులకు బీజం వేసింది. దారి పొడవునా డాక్టర్లు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, వివిధ గ్రామాలు, పట్టణాల ప్రజలు కాన్వాయ్‌ని ఆపి కేసీఆర్‌కు, ప్రొఫెసర్ జయశంకర్‌కు వీర తిలకాలు దిద్దారు. అడుగడుగునా జై తెలంగాణ నినాదాలు మారుమోగాయి.

కరీంనగర్ సింహగర్జనకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నాయకత్వంలో తొలి దశ ఉద్యమకారులు, దోస్తులతో కలిసి పులిహోర పొట్లాలు కట్టుకొని మండుటెండలో సభకు వెళ్లాం. ఆ సాయంత్రం సమైక్య సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యాన్ని మేం చూశాం. చంద్రోదయ వేళ కేసీఆర్ ఉపన్యాసం ప్రచండ తాపంలా సాగింది. తెలంగాణ నుడికార యాసబాషలతో ప్రవాహమై సాగింది. భాషపై మక్కువతో ఒక్కొక్క పలుకు సీమాంధ్ర పాలకుల, పెట్టుబడిదారుల గుండెల్లో ఫిరంగులై మోగాయి. ప్రజల భాషతో వ్యంగ్య సామెతలు, పిట్ట కథలు, ఉదాహరణలతో ప్రసంగం జలపాతంలా ఉద్విగ్నభరితంగా సాగింది. నాటి నుంచి నేటి వరకు టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నిర్వహిస్తున్న సభలన్నింటిలోనూ ఉత్సాహంగా పాల్గొంటున్నాం.



తెలంగాణల ప్రజల ఆర్తిని, కడగండ్లను, తెలంగాణ అస్తిత్వానికై నా కలాన్ని ఝళిపిస్తూ ప్రయాణిస్తున్నాను. అందులో భాగంగా వొల్లెడ, (సకల జనుల సమ్మె), మశాల్ (తెలంగాణ మహోద్యమ దీర్ఘకావ్యం), ఊరచెరువు,(మిషన్ భగీరథ) తడి, జనశంకరుడు (ప్రొఫెసర్ జయ శంకర్), కుర్చీ, తెలంగాణ తేనె పలుకులు లాంటి దీర్ఘకవితలతో సీమాంధ్ర ఆధిపత్య కుట్రలను వంచనలను, నిరసిస్తూ, తెలంగాణ పోరాట పటిమను కవిత్వీకరిస్తున్నాను.

తెలంగాణ సాధన ఉద్యమం అనేక అంశాల చరిత్రను ముందుకు తీసుకువచ్చింది. తెలంగాణ సమాజమంతా ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగను ప్రజా ఉద్యమంగా మార్చడం, బోనాలు, పీర్లు, దసరా, దీపావళుల పండుగలను రాష్ట్ర సాధనకై వాడుకొంది. ఉద్యమ సమయంలో ప్రజలు పండగలన్నీ తెలంగాణ సంబరాలుగా జరుపుకున్నారు. అస్తిత్వ ఆకాంక్షలకు ప్రతిరూపంగా తెలంగాణ తల్లి ఆవిర్భవించింది. ఊరూరా ఉద్యమ బతుకమ్మ ఆవిష్కరణలు జరిగాయి. చరిత్ర నిర్మాణాన్ని రాజకీయ ఉద్యమంగా మలిచి ఆధిపత్య శక్తులపై బాణం ఎక్కుపెట్టి నూటికి నూరుపాళ్లు కేసీఆర్ విజేతగా నిలిచారు. తెలంగాణ సాధన నినాదాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తి చేయడానికి 2006లో తెలంగాణ భవనాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత నమస్తే తెలంగాణ దినపత్రికతో పాటు, టీ న్యూస్ చానల్‌ను ప్రారంభించి ఆత్మగౌరవ స్వరాన్ని ఎలుగెత్తి చాటారు. తెలంగాణ కోసం బొంత పురుగునైనా ముద్దాడుతానన్నారు. అలయ్ బలయ్‌లతో, అహింసా మార్గంలో శాంతియుతంగా పయనించారు.





2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీతో పొత్తులతో ఎన్నికలకు పోవటాన్ని అనేక సంఘాలు, మేధావులు దెప్పిపొడిచారు. కేసీఆర్ ఏది చేసినా తెలంగాణ కోసమేనని నిరూపించారు. సమైక్యాంధ్ర పార్టీలతో జై తెలంగాణ అనిపించిన ఘనత కేసీఆర్‌దే. రాజీనామాలు, ఉప ఎన్నికలు తెలంగాణ ఉద్యమంలో భాగమేనని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా టీఆర్ఎస్‌దే గెలుపని నిరూపించారు. తెలంగాణకు అనుకూలంగా దేశమంతా తిరిగి 36 పార్టీలతో ఏకాభిప్రాయంగా ఒప్పించి సేకరించి మద్దతు లేఖలు ఇవ్వడంలో టీఆర్ఎస్(బీఆర్ఎస్) పార్టీ విశేష కృషి చేసింది. తెలంగాణ విముక్తి కోసం కేంద్రాన్ని కదిలించడానికి అయితే జైత్రయాత్ర కాదంటే నా శవయాత్ర అంటూ 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఉద్యమ నెగడు ఆరకుండా ఉద్యమ జేఏసీని ఏర్పాటు చేసి సకల జనుల సమ్మెలు, మిలియన్ మార్చ్‌లు, సడక్ బంద్‌లు, సాగర హారాలు, రైల్‌రోకోలు, ఆర్టీసీ బంద్‌లు, విద్యా సంస్థల బంద్‌లు, నిరాహార దీక్షలు, వంటా వార్పులు, మానవ హారాలతో ఉద్యమం మహోగ్ర రూపమెత్తింది. ఈ కార్యక్రమాలన్నింటికీ ముత్యాలకు దారంలా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అండగా నిలిచింది. తెలంగాణ మలి దశ ఉద్యమానికి కేసీఆర్ కేంద్ర స్థానమయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం విజయం సాధించి జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావం జరిగింది. కేసీఆర్ మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం మా లాంటి వాళ్లకు మరింత సంతోషకరమైన విషయం. తెలంగాణ ప్రజల కలలు నిజమయ్యాయి త్యాగాలు ఫలించాయి. పోరాటాలు సార్థకమయ్యాయి. తెలంగాణరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, 2018 లో రెండవసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదేండ్ల పరిపాలనలో స్వ రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా పయనించింది.

ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎన్నో ఆటుపోట్లను, అడ్డంకులను చవి చూసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా, జాతీయ స్థాయిలో విస్తరించేందుకు టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందింది. ఈ ఇరవై ఐదేండ్లలో ఎన్ని అవస్థలో, ఎన్నెన్ని ఎగుడు దిగుడులో చూసింది పార్టీ. ఎన్నో కష్టనష్టాలను, ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. బీఆర్ఎస్ మళ్లీ పూర్వ వైభవంలోకి రావాలని కోరుకుంటూ.. రజతోత్సవం వైపు పరుగులు తీస్తున్న బీఆర్ఎస్‌కు శుభాకాంక్షలు.

**చలో.. వరంగల్!**

# స్వయం ప్రతిపత్తి సాధ్యమయ్యేనా!



ఆస్కాని మారుతీ సాగర్
90107 56666

**కేంద్ర,రాష్ట్ర సంబంధాల్లో సఖ్యత లేకపోవడంపై తీవ్ర చర్చ నడుస్తున్న తరుణంలో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని తమిళనాడు సీఎం స్టాలిన్ తెరపైకి తెచ్చారు. ఇది పూర్తిగా సాధ్యమేనా అనే అంశంపై ఇప్పుడు దేశమంతా చర్చ నడుస్తున్నది. అయితే కేంద్రం, రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు పాలన చేస్తున్నప్పటికీ, ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించాలి. రాజకీయ లబ్ధి కోసం కాకుండా రాజ్యాంగ నిర్మాతలు చూపిన బాటలో నడుస్తూ పరస్పరం సర్దుకుపోతూ, ప్రగతి సాధించాల్సిన అవసరం దేశానికి ఎంతో ఉంది.**

కేంద్ర,రాష్ట్ర సంబంధాలపై ఎన్డీయే ప్రభుత్వపు పదేండ్ల కాలంలో చర్చ మరింత తీవ్రమైంది. వాస్తవానికి 1970ల నుండే కేంద్రం-రాష్ట్రాల సంబంధాలపై చర్చ ఉన్నది. ఏయే అంశాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉంటే బావుంటుంది. ఏయే అంశాలకు పరిమితం అయితే సమాఖ్య స్ఫూర్తి దెబ్బ తినకుండా ఉంటుందనే అంశాలపై కొన్ని రాష్ట్రాల్లో నాటి అధికార పార్టీలు పలు సూచనలు, తీర్మానాలు సైతం చేశాయి. ఈ మధ్య తమిళనాడు విషయంలో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు, ఆ తర్వాత స్టాలిన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తదితర అంశాల నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర సంబంధాల అంశం మరోసారి చర్చకు వస్తున్నది. తాము పంపిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకండాతన వద్దే వాటిని ఉంచుకున్నారని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవిపై స్టాలిన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నెలల తరబడి బిల్లులను గవర్నర్లు తమ వద్దే అట్టి పెట్టుకోవడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్ట్ పలు మార్లు చెప్పినప్పటికీ గవర్నర్ దగ్గర నుండి సానుకూల స్పందన రాలేదు. చివరకు సుప్రీం కోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకొని తీవ్ర వ్యాఖ్యలు చేయాల్సి వచ్చింది. సుదీర్ఘంగా బిల్లులు తమ వద్ద ఉంచుకునే అధికారం గవర్నర్ కు లేదని తేల్చి చెప్పింది. అంతే కాదు బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతికి కూడా గడువు విధించగలమని స్పష్టం చేసింది. ఆ తర్వాత గవర్నర్ ఆమోదం లేకుండానే తమిళనాడు ప్రభుత్వం పది బిల్లులను అసెంబ్లీలో పెట్టి చట్టాలయ్యాయని గెజిట్ వెలువరించింది. ఇది దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

తాజాగా రాష్ట్ర స్వయంప్రతిపత్తి, హక్కుల రక్షణ కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసఫ్ నేతృత్వంలో స్టాలిన్ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ పరిణామం తర్వాత కేంద్రం, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర విమర్శలు జరుగుతున్నాయి. తాజాగా ఉప రాష్ట్రపతి తీవ్ర స్వరంతో స్పందించారు. ఆర్టికల్ 142 గురించి మాట్లాడారు. సుప్రీం కోర్టు చట్టాలు చేస్తుందా అని ప్రశ్నించారు. రాజ్యాంగ వ్యవస్థల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు పరిస్థితి ఇట్లాగే ఉంటుంది. గవర్నర్ తన పరిధి మేరకు ఉండి ఉంటే పరిస్థితి ఇట్లా అయ్యేది కాదని, ఇంతదాకా చర్చ వచ్చేది కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ఎన్డీయే పాలనలో విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు మితిమీరి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో మన రాష్టంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నాటి గవర్నర్ తో చాలా విషయాల్లో ఇబ్బంది పడాల్సి వచ్చింది. రాష్ట్రాల అధికారాల కోసం గళం విప్పి మాట్లాడటమే కాదు, కేంద్రంతో పోరుబాట పట్టిన నాయకుడు కేసీఆర్. రాజ్యాంగ పరిధి దాటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ అధికారాల్లో జోక్యం చేసుకోకూడదని ఆయన గట్టిగా వాదించారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. మొన్నటి వరకు కేరళలో ముఖ్యమంత్రి విజయన్‌కు, గవర్నర్ ఆరిఫ్‌కు మధ్య మాటల యుద్ధం జరిగింది. బెంగాల్‌లో మమతదీ అదే పరిస్థితి. తమిళనాడులో స్టాలిన్ పరిస్థితి తాజా నిర్ణయాలకు కారణమవుతున్నాయనటంలో సందేహం లేదు. గవర్నర్లు ఢీ అంటే ఢీ అంటున్నారు. సుప్రీం కోర్టు ఘాటు వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మితిమీరి వ్యవహరిస్తోందా అనే చర్చ ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతోంది. నీట్ పరీక్ష, నూతన జాతీయ విద్యా విధానం, భాష విషయంలో బలవంత పెట్టడం, జీఎస్టీ పేరిట ముక్కుపిండి వసూలు చేయటం ఇలాంటి విషయాలన్నీ రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలను ఇబ్బంది పెడుతున్నారు. ఈ నేపథ్యంలో స్టాలిన్ ఆశించినట్టు రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభిస్తే విద్య, వైద్యం, సంక్షేమం లాంటి విషయాలలో రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా నిర్ణయాలు తీసుకొనేందుకు అవకాశం ఉంటుంది.




ప్రపంచీకరణ వేగం పుంజుకున్నాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పలు విషయాల్లో స్పర్ధలు వస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలోనూ, బీజేపీ హయాంలోనూ కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, పరిపాలనా సంస్కరణలపై కమిటీలను వేశారు. రాజ్యాంగాన్ని పున: సమీక్షించాలని 2000 సంవత్సరంలో జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య కమిషన్ ఏర్పాటు చేయగా, కేంద్ర ,రాష్ట్ర సంబంధాల మెరుగుదల గురించి ఆ కమిషన్ పలు సూచనలు చేసింది. గవర్నర్‌ను నియమించే ముందు ముఖ్యమంత్రిని సంప్రదించాలని చెప్పింది. గవర్నర్ తన వద్దకు వచ్చిన బిల్లులపై ఆరు నెలల్లోగా నిర్ణయాన్ని వెలువరించాలని సూచన చేసింది.

> 2007లో కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు మాజీ సీజేఐ మదన్ మోహన్ పూంఛ్ నేతృత్వంలో ఇంకో కమిషన్ వేసింది. కేంద, రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేయడం ఎలాగో చెప్పాలని కోరింది. ఈ కమిషన్ చాలా ముఖ్యమైన సూచనలు చేసింది. అందులో గవర్నర్ల గురించిన ప్రస్తావన ఇట్లా ఉంది.... 'గవర్నర్లను సరైన కారణం లేకుండా తొలగించకూడదు. వివాదాస్పదం కాని, రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి. గవర్నర్ తన వద్దకు వచ్చిన బిల్లులపై ఆరు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి.' అయితే ఈ కమిటీ సూచనలను ఎన్డీయే సర్కారు పట్టించుకోలేదా? అస్సలు పరిగణనలోకి తీసుకోవాలనే ఆలోచన చేయలేదా? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే సమాధానమిస్తున్నాయి!

కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయంలో 1969లోనే తమిళనాడు తన గళాన్ని వినిపించింది. ఈ నేపథ్యంలో సమాఖ్య స్ఫూర్తికి భంగం కలగకుండా కేంద్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం తమిళనాడు స్వయం ప్రతిపత్తి కోసం వ్యవహరిస్తున్నట్లుగానే మరి కొన్ని రాష్ట్రాలు వ్యవహరిస్తే పరిస్థితి ఏమిటనే సందేహం వస్తుంది. కాబట్టి ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడాలంటే రాజ్యాంగ మౌలిక సూత్రం దెబ్బ తినకుండా వ్యవహరించాల్సి ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కేంద్ర ప్రభుత్వ తీరును మూకుమ్మడిగా నిరసించిన సందర్భాలు అనేకం. ఈ మధ్యకాలంలోనే డిలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు సమావేశమై 25 ఏండ్ల వరకు డిలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లరాదని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇవన్నీ చూస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దూరం క్రమంగా పెరుగుతూ వస్తున్న విషయం తేటతెల్లమవుతున్నది. ఏది ఏమైనా మన రాజ్యాంగ నిర్మాతలు చూపిన బాటలో నడవాల్సిన అనివార్యత కేంద్రం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలపై ఉంటుంది. తాము మొండిగా తీసుకునే నిర్ణయాలను బలవంతంగా రాష్ట్రాలపై రుద్ది దేశం ముక్కలు అయ్యే పరిస్థితి రాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. అలాగే ఆవేశంతో కాకుండా ఆలోచనతో రాజ్యాంగానికి లోబడి నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగి ఫెడరల్ స్ఫూర్తిని చాటి చెప్పాల్సిన బాధ్యత రాష్ట్రాలకూ ఉంది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)





## జవాబుదారీతనానికి సమాధేనా?



అధికారంలో ఉన్నవారిని ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించవచ్చు. అయితే డిజిటల్ డేటా ప్రొటెక్షన్ పేరుతో మోదీ సర్కార్ ప్రజలకు ఉన్న ఆ హక్కును లాగేసుకుంది. ఎవరికి రుణ మాఫీ జరిగింది? ఎవరు లంచం తీసుకున్నారు?..ఇలాంటి విషయాలన్నీ ఇక వ్యక్తిగత సమాచారం కిందకు వస్తాయి. ఆర్టీఐని బ్లాక్ చేసి, జవాబుదారీతనాన్ని దాటేసే కొత్త మార్గాన్ని తెరిచారు.

- యోగేంద్ర యాదవ్, రాజకీయ-ఎన్నికల విశ్లేషకుడు





# జాబ్ క్యాలెండర్ ఊహల్లోనేనా!

**తెలంగాణ రాష్ట్రాన్ని నిరుద్యోగ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే మహత్తర లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు ప్రకటించిన హామీలకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. ఇది నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది. ముఖ్యంగా 'జాబ్ క్యాలెండర్' విషయంలో దాని ఊసే ఎత్తని కాంగ్రెస్ ప్రభుత్వం, వాగ్దానాలు చేసి మర్చిపోయిందన్న విమర్శలు నిరుద్యోగుల్లో వెల్లు వెత్తుతున్నాయి.**

ఒకే సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ప్రసంగాలకే పరిమితమైంది. ఉద్యోగాల భర్తీపై స్పష్టత లేకపోవడమే కాకుండా, వివిధ శాఖల్లో ఇప్పటికే ఖాళీగా ఉన్న వేలాది పోస్టులకూ నియామక ప్రక్రియ మొదలవ్వలేదు. 2024 చివరి నాటికి 9,000 మంది ఉద్యోగ విరమణ పొందగా, 2025 ఆర్థిక సంవత్సరం చివరికి మరో 9,000 మంది రిటైరవుతారు. ఇవన్నీ భర్తీ చేయాల్సిన పోస్టులే కానీ, నియామక ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రతి ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల ఖాళీలతో కూడిన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, సెప్టెంబర్ 17 నాటికి నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించినా, ఇప్పటివరకు ఏ శాఖ నుంచి కూడా స్పష్టమైన వివరాలు వెలువడలేదు. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు పొందడంలో ఆలస్యం, క్యాడర్ స్ట్రెంత్ విభజనపై స్పష్టత లేకపోవడం, విభాగాల పునర్వ్యవస్థీకరణ జరగకపోవడం వంటి కారణాలతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈ వర్గాలకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలవకుండా పోయాయి. ఇది ఆ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది. సర్వే, ల్యాండ్ రికార్డుల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు ఇప్పటికీ పునర్వ్యవస్థీకరణ జరగక కొట్టుకుంటున్నాయి. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలకు మున్సిపల్ ఇంజినీర్ పోస్టులు మంజూరు కాలేదు. నీటి పారుదల శాఖలో 36 డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది. విద్యా శాఖలో అన్ని జిల్లాలకు డీఈవో పోస్టులు ఇప్పటికీ మంజూరు కాలేదు. ఇంటర్మీడియట్ విద్యాధికారుల పోస్టులే లేవు. కొత్తగా ఏర్పాటైన కాలేజీలకు పోస్టులు మంజూరు చేయలేదు. నోడల్ అధికారులతోనే వ్యవస్థ నడుస్తోంది.

> ప్రతి నిరుద్యోగ యువకుడికి నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతిని అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటివరకు ఆ ప్రక్రియను ప్రారంభించలేదు. ఎవరి ఆధారంతో ఎలా అర్హత నిర్దేశించబడుతుందో స్పష్టత లేదు. సాంకేతికంగా ఎలా అమలు చేస్తారు అన్నదీ తెలియదు. ఏడు జోన్లలో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీలు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటి వరకు ఆ ప్రక్రియను ప్రారంభించలేదు. స్కిల్ సెంటర్ల ఏర్పాటూ ఆమోద దశలోనే నిలిచిపోయింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ధ్యేయం ఆచరణకు దూరంగా ఉందనే అభిప్రాయం యువతలో నెలకొంది.

విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు యూత్ కమిషన్ ఏర్పాటు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాల భరోసా ఇవన్నీ ఓటు వేసే ముందు వినిపించిన వాగ్దానాలుగా మిగిలిపోయాయి. ఎలాంటి ప్రణాళిక గాని, నిధుల విడుదల గాని జరుగలేదు. ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఉచిత వైఫై, యూనివర్సిటీల రీసెర్చ్ స్కాలర్స్‌కు నెలకు రూ.10 వేల ఫెలోషిప్ వంటి హామీలు కూడా ప్రయోగ దశలోనే ఉన్నాయి.విద్యార్థులకు గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనం రూ.50 వేలకు పెంచుతామని చెప్పిన మాటలు అమలులోకి రాలేదు. తొలిసారి రుసుము చెల్లించి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేరు నమోదు చేస్తే, ఆ ఏడాదిలో మిగతా నోటిఫికేషన్లకు ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్న హామీ కూడా ఇంకా అమలులోకి రాలేదు. పీఎస్సీ ద్వారా నియామకాల ప్రక్రియ అంత వేగంగా సాగడం లేదు. నియమిత ఉద్యోగాలను భర్తీ చేయకుండా, రిటైర్డ్ ఉద్యోగులనే మళ్లీ కాంట్రాక్ట్ లేదా కన్సల్టెంట్ రూపంలో కొనసాగిస్తూ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులతో వ్యవస్థ నడిపిస్తున్న తీరు విస్తృత స్థాయిలో విమర్శలకు లోనవుతోంది. ఒకవైపు ఉద్యోగ ఖాళీలు పెరుగుతుంటే, మరోవైపు నియామకాలు జరగకపోవడమే కాకుండా, కింది స్థాయి ఉద్యోగాలకు కూడా ప్రమోషన్ రాకపోవడం వల్ల ఉద్యోగ వ్యవస్థ అంతా ఇబ్బందుల్లో పడుతోంది.

తెలంగాణ రాష్ట్ర యువత, ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకం వృథా కాకూడదు. ఒకవేళ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైతే ప్రజాస్వామ్య వ్యవస్థపై గల విశ్వాసాన్నే దెబ్బతీస్తుంది. ముఖ్యంగా ఉద్యోగ అవకాశాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇవ్వబడినవని నిర్ధారితమైతే, అది తర తరాలకు తీవ్ర ద్రోహంగా నిలుస్తుంది.

**కాబట్టి ప్రభుత్వం తక్షణమే కింది చర్యలు తీసుకోవాలి:**

- సక్రమమైన జాబ్ క్యాలెండర్ విడుదల: ప్రతి శాఖ నుంచి ఖాళీల వివరాలను సేకరించి, వార్షిక కాలపట్టిక ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి.
- నిరుద్యోగ భృతి అమలు: నిబంధనలతో కూడిన, పారదర్శకంగా ఉండే నిరుద్యోగ భృతి విధానాన్ని రూపొందించి అమలు చేయాలి.
- బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రత్యేక డ్రైవ్‌లో భర్తీ చేయాలి.
- విభాగాల పునర్వ్యవస్థీకరణ: కొత్త మున్సిపాలిటీలు, శాఖల్లో కొత్తగా ఏర్పడిన డివిజన్లకు అవసరమైన పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలి.
- యువత ఉపాధికి శాశ్వత ప్రణాళిక: ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీలు, స్కిల్ సెంటర్లు, రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ లాంటి హామీలను కార్యరూపంలోకి తేవాలి.
- పారదర్శక నియామక వ్యవస్థ: ఉద్యోగ నియామకాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తి స్వతంత్రతతో నడిపిస్తూ, ఆన్‌లైన్ అప్లికేషన్, రిజిస్ట్రేషన్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలి.
- ప్రభుత్వాన్ని యువత గౌరవించాలంటే, మాటల్లో కంటే ఆచరణలో ఎక్కువగా వినిపించే చర్యలు అవసరం. ఉద్యోగాలు ఇవ్వడం ఒక రాజకీయ హామీ కాదు అది ఒక నైతిక బాధ్యత అని ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రం అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకం. వారిని నిరుద్యోగం అనే చీకటి గదిలో నెట్టేయకుండా, భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. అప్పుడే నిజమైన ప్రజా పాలనకు న్యాయం జరిగిందనిపిస్తుంది.



జి.రాజేష్ నాయక్
9603579115

(వ్యాసకర్త: పరిశోధక విద్యార్థి, ఓయూ)